www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 30 సెప్టెంబరు 2024

5


పశ్చిమ గోదావరి



వసతి గృహాల సందర్శన

మొగల్తూరు : మొగల్తూరులోని ఎస్‌సి బాలికల, బిసి బాలుర వసతి గృహాలను ఆదివారం న్యాయమూర్తులు సందర్శించారు. ఉన్నత రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నరసాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.విజయ దుర్గ, అదనపు సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) కె.శ్రీనివాస్ వసతి గృహాలను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సీతారాంపురంలోని మిషన్ ఆఫ్ హోప్ చిల్డ్రన్ హోంను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశించిన వివరాలను వసతిగృహాల వార్డెన్‌ల నుంచి, బాల బాలికలను అడిగి తెలుసుకున్నారు. వసతిగృహాల గదులు, వంటశాల, మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయం, మెడికల్, తదితర అంశాలు స్వయంగా పరిశీలించి వివరాలు తెలుసుకుని నమోదు చేశారు. వార్డెన్‌లకు, వంట చేసే వారికి పలు సూచనలిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో వారి వెంట అదనపు సివిల్ జడ్జి కె.శ్రీనివాస్, నరసాపురం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం.. రూ.20 వేలు ఎప్పుడు..!



కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అసలు ఇస్తుందా.. ఖరీఫ్ ముగిసే దశకు చేరుతున్నా.. పెట్టుబడి సాయంపై ప్రభుత్వం ఎందుకు మాట్లాడం లేదు.. దీనికి సంబంధించిన విధి విధానాలను ఇప్పటివరకూ ఎందుకు ప్రకటించలేదు.. సాగుకు అవసరమైనప్పుడు ఇవ్వకుండా తర్వాత ఇస్తే ప్రయోజనం ఏంటన్న చర్చ జిల్లా రైతాంగంలో విస్తృతంగా కొనసాగుతోంది. ప్రభుత్వం వెంటనే అన్నదాత సుఖీభవ కింద అందించే పెట్టుబడి సాయం అందించాలని రైతులు కోరుతున్నారు.

- కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులపైనే
- ఖరీఫ్ సాగుకు అందని పెట్టుబడి సాయం
- రెండు జిల్లాల్లో 2.50 లక్షల మంది రైతులు ఎదురుచూపు
- అన్నదాత సుఖీభవ అమలుపై రైతుల్లో చర్చ
- కౌలురైతులకు రుణాలు లేవు.. సాయం లేదు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ సాగు ప్రారంభించి 70 రోజులు దాటిపోయింది. వరిపొలాలు పొట్టదశకు చేరుతున్నాయి. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద అందిస్తామని చెప్పిన పెట్టుబడి సాయం ఇప్పటికీ అందించలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకు పెద్దఎత్తున పెట్టుబడి అవసరం. ఇటువంటి తరుణంలో అందించకపోవడంపై రైతుల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది. గత ప్రభుత్వం కేంద్రం ఇచ్చే రూ. ఆరు వేలతో కలిపి రైతు భరోసా సాయం కింద ఏటా రూ.13,500 చొప్పున రైతులకు అందించేది. కేంద్ర ప్రభుత్వం మూడు విడతలుగా రూ.ఆరు వేలు, రాష్ట్ర ప్రభుత్వం మే చివరి వారంలో మొదటి విడతగా రూ.5,500, జనవరిలో రెండో విడతగా రూ.రెండు వేలు, రైతు భరోసా సొమ్ము జమచేసేది. గత ప్రభుత్వ హయాంలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రైతుభరోసా సాయం అందుకున్న రైతుల సంఖ్య 2.50 లక్షల మందికి పైగా ఉన్నారు. ఎన్నికల్లో భాగంగా టిడిపి కూటమి తాము అధికారంలోకి వస్తే పెట్టుబడి సాయం కింద ఏటా రూ.20 వేలు అందిస్తామని రైతులకు హామీ ఇచ్చింది. దీంతో రైతులు గంపగుత్తగా కూటమి పార్టీలకు ఓట్లు వేసి గెలిపించారు. కేంద్ర ప్రభుత్వం పిఎం కిసాన్ కింద రైతులకు అందించే మొదటి విడత సొమ్మును జూన్‌లోనే విడుదల చేసింది. అన్నదాత సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న పెట్టుబడి సాయం మాత్రం ఇప్పటికీ చిల్లిగవ్వ రైతులకు అందలేదు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటేసింది. ఇప్పటికీ పెట్టుబడి సాయం ఎన్ని విడతలుగా ఇస్తారు. ఎప్పుడు ఇస్తారన్న సమాచారం కూడా ప్రభుత్వం చెప్పడం లేదు. ఇప్పటికే ఖరీఫ్ సాగుకు సంబంధించి రైతులు ఎకరాకు రూ.20 వేల వరకూ పెట్టుబడి పెట్టారు. ఇంకా పెద్ద ఎత్తున పెట్టుబడి పెట్టాల్సి ఉంది. ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తే ఆర్థికంగా వెసులుబాటు ఉంటుందని రైతులు భావిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ఆ ఊసే ఎత్తడం లేదు. గతంలో రుణమాఫీకి సంబంధించి సైతం టిడిపి ప్రభుత్వం అనేక పిల్లి మొగ్గలు వేసింది. దీంతో ఇప్పుడు పెట్టుబడి సాయం అందజేతపై రైతుల్లో అనేక అపోహలు నెలకొన్నాయి. ప్రభుత్వం వెంటనే పెట్టుబడి సాయం అందించాలని రైతులు కోరుతున్నారు.

పంట రుణాలు లేవు.. పెట్టుబడి సాయమూ లేదు

రెండు జిల్లాల్లో మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నారు. జిల్లాలో వ్యవసాయ సాగు చేస్తున్నది 70 శాతంపైగా కౌలురైతులే. గత ప్రభుత్వ హయాంలో కౌలురైతుల పరిస్థితి దయనీయాంగా మారింది. కౌలు కార్డులు, పంట రుణాలు అరకొరగా అందించి చేతులు దులుపుకుంది. రైతు భరోసా సాయం సైతం కౌలురైతులకు అందని పరిస్థితి నెలకొంది. దీంతో కౌలురైతులు అప్పుల ఊబిలో కూరుకుని ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు అనేకం చోటుచేసుకున్నాయి. తాము అధికారంలోకి వస్తే కౌలు రైతులను ఆదుకుంటామంటూ టిడిపి కూటమి చెప్పింది. కూటమి అధికారం చేపట్టడంతో కౌలురైతులు తమకు పంట రుణాలు, పెట్టుబడి సాయం అందుతుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కౌలుకార్డుల జారీప్రక్రియలో గానీ, పంటరుణాల మంజూరులో గానీ కౌలురైతులకు న్యాయం జరగలేదు. ప్రభుత్వం అందిస్తామన్న పెట్టుబడి సాయమూ అందలేదు. దీంతో కౌలురైతులు పెట్టుబడుల కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలని అంతా కోరుతున్నారు.



వాటర్‌వర్క్స్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర బడ్జెట్ లోటులో ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమానికి నిధుల కొరత లేదని, అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి పి.నారాయణ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో ఆదివారం తొలిసారిగా అడుగుపెట్టిన మంత్రి నారాయణ జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి పట్టణంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను సంబంధిత అధికారులతో పరిశీలించారు. మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్, హిందూ బర్రెల్ గ్రౌండ్, డంపింగ్ యార్డు, అబ్దుల్ కలాం హెల్త్ పార్క్, నారా చంద్రబాబు నాయుడు ఉద్యానవనం, ఎన్‌టిఆర్ కళాక్షేత్రం, అన్నా క్యాంటీన్, ఎన్‌టిఆర్ టిడ్కో ఇళ్ల సముదాయాలను పరిశీలించారు. మంత్రి నిమ్మల రామానాయుడు పాలకొల్లు పట్టణ అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ పనులను తదితర విషయాలను మంత్రి నారాయణకు వివరించారు. అభివృద్ధి పనులు వేగవంతం చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని నారాయణ సూచించారు. ఆయన వెంట జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఆర్‌డిఒ దాసిరాజు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, మున్సిపల్ కమిషనర్ బి.విజయ సారథి, నాయకులు ఉన్నారు.

మంత్రి నారాయణకు ఘన స్వాగతం

పాలకొల్లులో ఆదివారం అభివద్ధి పనులు పరిశీలనకు వచ్చిన మంత్రి పి. నారాయణ కు ఘన స్వాగతం లభించింది. ముందుగా బ్రాడీపేట మున్సిపల్ వాటర్ వర్క్స్ నకు చేరుకున్న ఆయనకు మంత్రి నిమ్మల రామానాయుడు శాలువా కప్పి గజమాల వేసి సత్కరించారు. కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పూలమాలలు వేశారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆధునిక టెక్నాలజీని ఉపయోగించండి

అభివృద్ధి పనుల్లో ఆధునిక టెక్నాలజీని ఉపయోగించాలని మంత్రి నారాయణ అధికారులకు సూచించారు. స్థానిక పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశ మందిరంలో మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులతో మంత్రి పి.నారాయణ పాలకొల్లు అభివృద్ధి పనులపై సమీక్షించారు. పట్టణంలో మిగిలి ఉన్న వివిధ అభివృద్ధి పనులు, తాగునీరు, రహదారులు, డ్రెయినేజీలు, శానిటేషన్, తదితర అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి నారాయణకు నిమ్మల రామానాయుడు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ పాలకొల్లులో టిడ్కో గృహాలు పూర్తి చేయడంతో పాటు, పూర్తి మౌలిక సదుపాయాలు కల్పించి నిరుపేదలందరికీ సొంతింటికల నిజం చేస్తామన్నారు. హాస్పటల్, అంగన్వాడీ సెంటర్లు, షాపింగ్ మాల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో తాగునీరు, డ్రెయినేజీ, శానిటేషన్, వీధిలైట్లపై దృష్టి పెడితే ప్రజలు సంతృప్తి చెందుతారని అధికారులకు మంత్రి తెలిపారు. పారిశుధ్యం మెరుగుదలకు స్వీపింగ్ యంత్రాలను విరివిగా వాడాలన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒక అన్నా క్యాంటీన్ తప్పనిసరిగా ఉండాలని, జిల్లాలో ఉండి, ఆచంట నియోజక వర్గాలకు అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు సి.నాగారాణికి మంత్రి సూచించారు. పాలకొల్లు పురపాలక సంఘానికి అవసరమైన నిధులు సమకూర్చి, వచ్చే నెలలో శంకుస్థాపనకు వస్తానని తెలిపారు. జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ పాలకొల్లు పట్టణానికి అభివృద్ధి కార్యక్రమాలు పరిశీలనకు ఆహ్వానించగా వచ్చినందుకు మంత్రి నారాయణకు ధన్యవాదాలు తెలిపారు. ఐదేళ్ల గత ప్రభుత్వ పాలనలో 20 సంవత్సరాలు రాష్ట్రం వెనక్కి వెళ్లిందన్నారు. 40 వేలు జనాభాకు తగ్గట్టుగా తాగునీటి సరఫరా ఉందని, ప్రస్తుత జనాభాకు అనుగుణంగా తాగునీటి చెరువులు, వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. టిడ్కో గృహాలు పూర్తిస్థాయిలో గృహప్రవేశాలు జరిగితే పట్టణానికి అయిదు నుండి ఆరు వార్డులు పెరుగుతాయన్నారు. అందుకు తగ్గట్టుగా నిధులు, మున్సిపల్ సిబ్బంది పోస్టులు మంజూరు చేయాలన్నారు.

సీతారాం ఏచూరి మృతి బాధాకరం

సంస్మరణ సభలో సిపిఎం నేతల నివాళి

ప్రజాశక్తి - నరసాపురం

భారతదేశ రాజ్యాంగ రక్షణ కోసం, లౌకిక శక్తులను ఏకం చేస్తూ భారత రాజకీయాలలో తనదైన ముద్ర వేసుకున్న సిపిఎం ప్రధాన కార్యదర్శి, వామపక్ష మేధావి సీతారాం ఏచూరి మృతి తీరని లోటు అని పలువురు నాయకులు నివాళులర్పించారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం సంస్మరణ సభ స్థానిక అల్లూరి సత్యనారాయణ రాజు సాంస్కృతిక కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ విద్యార్థిగా ఉన్నప్పుడే ఏచూరి భారత సమాజం పట్ల పూర్తి అవగాహన ఏర్పరచుకున్నారన్నారు. దేశ సామాజిక అసమానతలను అధ్యయనం చేసిన ఏచూరి విద్యార్థిగా పలు ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. సిపిఎం నాయకునిగా పలు ప్రజా సమస్యలకు పరిష్కారం చూపిన ఆదర్శ ప్రజా నాయకుడని కొనియాడారు. దేశంలో మతన్మోదానికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటాన్ని ఆయన సాగించారన్నారు. యుపిఎ ప్రభుత్వ హయాంలో ప్రత్యామ్నాయ ప్రజానుకూల విధానాలను రూపొందించి, వాటిని అమలు చేయించారని గుర్తు చేశారు. పార్లమెంట్ సభ్యునిగా ఏచూరి దేశంలోని ప్రజా సమస్యలపై తనదైన శైలిలో గళమెత్తి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ప్రశంసలు అందుకున్నారన్నారు. ఏచూరి జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం అందరిపై ఉందని ఆయనకు నివాళులర్పించారు. సిపిఐ రాష్ట్ర సీనియర్ నాయకులు నెక్కంటి సుబ్బారావు మాట్లాడుతూ ఏచూరి మృతితో భారత దేశం గొప్ప వామపక్ష మేధావిని కోల్పోయిందన్నారు. నరసాపురం మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవనాయుడు మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో ముఖ్యపాత్ర పోషించిన ఏచూరి తెలుగువారు కావడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. ఏచూరి విద్యార్థి ఉద్యమంలో చేసిన పోరాటాలు ఎంతో స్ఫూర్తిని ఇచ్చేవన్నారు. సిపిఎం నాయకునిగా దేశంలో వివిధ సమస్యలను ప్రస్తావించిన తీరు అందరినీ ఆలోచింపచేసేవన్నారు. నరసాపురం న్యాయవాదుల సంఘం అధ్యక్షులు చేగొండి మోహన్ బాలాజీ మాట్లాడుతూ ఏచూరి ఆదర్శవంతమైన ప్రజానాయకుడన్నారు. న్యాయవాది సోడదాసి శ్రీధర్ మాట్లాడుతూ దేశం ఎదొర్కొంటున్న పలు సమస్యలకు పరిష్కారం చూపిన గొప్ప మేధావి ఏచూరి అని అన్నారు. భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం ఆయన చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఏచూరి మృతి చాలా బాధాకరమని తెలిపారు. సభకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కవురు పెద్దిరాజు అధ్యక్షత వహించారు. సభలో రెడ్డప్ప ధవేజీ, చౌకడిపో డీలర్ల సంఘం అధ్యక్షులు అధికార ఏసు, వేములదీవి మాజీ సర్పంచి అడ్డాల శ్రీనివాస్ రావు, కాంగ్రెస్ నాయకులు కానూరి బుజ్జి, న్యాయవాది పూరిళ్ల శ్రీనివాస్, సిపిఎం నాయకుల ముచ్చర్ల త్రిమూర్తులు, పొగాకు పూర్ణ మాట్లాడారు. అంతకు ముందు ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



నరసాపురం : మాట్లాడుతున్న సీతారాం

వీరవాసరం : సీతారాం ఏచూరి, ఆర్‌ఎస్‌ల జీవిత ఆశయాలు నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని సిఐటియు నాయకులు ఎం.ఆంజనేయులు, డి.వరలక్ష్మి, పి.నాగరత్నం అన్నారు. ఆదివారం వీరవాసరం, రాయకుదురులో సీతారాం ఏచూరి, ఆర్‌ఎస్ చిత్రపటాల ముందు పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో వామపక్ష అభ్యుదయ భావాలు, లౌకిక వాదం, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలపై సీతారాం ఏచూరి చేసిన ఉపన్యాసాలు దేశ పౌరులకు ఉపయోగపడతాయని అన్నారు. శ్రమ చేసేవారు శ్రమకు తగ్గ ఫలితం అందాలంటే పాలకులు ఏం చేయాలో చెప్పగలిగే గొప్ప నాయకులని అన్నారు. మన జిల్లాలో రైస్ మిల్లు కార్మికులు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, అంగన్వాడీ, ఆశ వంటి స్కీం ఉద్యోగులు, దళితులు, గిరిజనులు ఉద్యమాలకు నాయకత్వం వహించి వారి కష్టసుఖాలలో భాగస్వామి అయిన ఆర్‌ఎస్ మహోన్నతమైన నాయకుడని అన్నారు. చావు, పుట్టుకల మధ్యన ఉండే జీవితం చాలా విలువైనదని దానిని ప్రజలకు అంకితం చేసి వారు జీవించారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్వతి, నిర్మల, తులసి పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పరిరక్షణకు మరో పోరాటం

వచ్చేనెల 1, 2, 3 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు

కార్మిక, రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల నిర్ణయం

ప్రజాశక్తి - భీమవరం

విశాఖ ఉక్కును పరిరక్షించుకునేందుకు మరో పోరాటానికి నాంది పలికేందుకు కార్మిక, రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాలు సిద్ధమవుతున్నాయి. వచ్చేనెల 1, 2, 3 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించే విధంగా కార్యాచరణ రూపొందించారు. భీమవరం సిఐటియు కార్యాలయంలో కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక ప్రజాసంఘాల సమన్వయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, ఎఐటియుసి జిల్లా నాయకులు చెల్లబోయిన రంగారావు మాట్లాడారు. విశాఖ ఉక్కును అమ్మేయడం కోసం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు బ్రేక్ పడలేదని, రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో చేతులుడిగి కూర్చుందని విమర్శించారు. ఒకపక్క ప్రయివేటీకరణ చేయబోమని ప్రకటిస్తూనే మరోపక్క పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులను వేర్వేరు రాష్ట్రాల్లో ఉండే స్టీల్ ప్లాంట్లకు బదిలీ చేయడం నాలుగువేల మంది కాంట్రాక్టు కార్మికులను పనిలోకి రావద్దని చెప్పడం ఇవన్నీ చూస్తుంటే స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేసే ప్రయత్నాలు మొదలయ్యాయని అర్థమవుతోందన్నారు. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో అన్ని కార్మిక సంఘాలు, రైతు, వ్యవసాయ కార్మిక, యువజన విద్యార్థి, మహిళా సంఘాలు సమావేశాలు ఏర్పాటు చేసుకుని రిలే నిరాహార దీక్షలు నిర్వహించాలని నిర్ణయించాయన్నారు. దీనిలో భాగంగానే జిల్లాలో కూడా భీమవరంతో పాటు వివిధ పట్టణాల్లో ఆందోళన నిర్వహించడానికి ఈ సంఘాలన్నీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒకటిన కార్మిక సంఘాలు, రెండున విద్యార్థి, యువజన మహిళ సంఘాలు, మూడున రైతు వ్యవసాయ కార్మిక కార్మిక సంఘాలు రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నాయని తెలిపారు. ప్రభుత్వం విశాఖ ఉక్కును రక్షించకపోతే కార్మిక రైతు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రజలే రక్షించుకోవడానికి సిద్ధపడతారని చెప్పారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.రామాంజనేయులు, సిఐటియు జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఐటియుసి జిల్లా నాయకులు రంగారావు

రఘురామకృష్ణంరాజుపై చర్యలు తీసుకోవాలి

కెవిపిఎస్ ఆధ్వర్యాన ఆందోళనలు



ఉండిలో నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ నేతలు

ప్రజాశక్తి - ఉండి

ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు అంబేద్కర్ ఫ్లెక్సీని తొలగించడం అంబేద్కర్‌ను ఘోరంగా అవమానించడమేనని, ఈ తప్పును ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు అంగీకరించాలని కెవిపిఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పాందువ్వ, యండగండి గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహానికి కెవిపిఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించి ఆందోళనలు చేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపి మాట్లాడుతూ ఎంఎల్‌ఎ అంబేద్కర్ ఫ్లెక్సీని తొలగించడం ఆయనను అవమానించడమే అన్నారు. అంబేద్కర్‌ను కేవలం దళితులకే చెందిన వారిగా ముద్ర వేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల నాయకులు తాడి కుమార్, ఎం.రామయ్య, గ్రామ నాయకులు ఎం.ప్రశాంత్, సిహెచ్ చిట్టిబాబు, డి.దుర్గాప్రసాద్, ఎం.పూర్ణ, ఎన్.సుబ్రహ్మణ్యం, శివకృష్ణ, లక్ష్మణరావు, జి.కాసులు, కన్నయ్య, రమేష్, పండు, కె.శ్రీను, నాగరాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యలమంచిలి : ఏలూరుపాడులో అంబేద్కర్ ఫ్లెక్సీని తొలగించిన ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజుపై ప్రభుత్వం వెంటనే ఎస్‌సి, ఎస్‌టి, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ జిల్లా నాయకులు కానేటి బాలరాజు డిమాండ్ చేశారు, ఆదివారం సాయంత్రం మండలంలోని చించినాడ గ్రామంలో అరుంధతీపేట చిల్డ్రన్స్ పార్క్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ రఘురామకృష్ణంరాజు వెంటనే క్షమాపణ చెప్పాలని లేని పక్షంలో ప్రభుత్వం ఆయనపై ఎస్‌సి, ఎస్‌టి, అట్రాసిటీ కేసును నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, ముమ్మిడివరపు ఆంజనేయులు, గోగినేని శ్రీనివాస్, తెన్నేటి స్టాలిన్, తాడి ఉదయ్, పల్లేరు అనిల్, ఆకుమర్తి పద్మరాజు, ఆకుమర్తి జోసెఫ్, టి.జయరాజు, జి.ఫణీంద్ర పాల్గొన్నారు.



యలమంచిలిలో నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ నేతలు

ముగిసిన భగత్‌సింగ్ స్టూడెంట్ ఫెస్ట్

నరసాపురం: స్వాతంత్ర సమరయోధులు భగత్‌సింగ్, గాంధీ జయంతి వారోత్సవాల్లో భాగంగా ఈనెల 27వ తేదీ నుంచి మొదలైన భగత్ సింగ్ స్టూడెంట్ ఫెస్ట్ స్థానిక లయన్స్ క్లబ్ హాల్‌లో ఎంతో ఘనంగా ముగిసాయి. ఈ కార్యక్రమంలో నరసాపురం, పాలకొల్లు పట్టణంలో ఉన్న విద్యార్థులు హాజరై నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నారు. ఉదయం పూట పాటల పోటీలు జరిగాయి. విద్యార్థులు ప్రదర్శించిన అవయవదానం అనే లఘునాటిక విద్యార్థులను, అక్కడికి వచ్చిన అతిథులను ఎంతో ఆకట్టుకుంది. విద్యార్థులు ప్రదర్శించిన డ్యాన్స్ ప్రదర్శనలు ఎంతో ఆకర్షణగా నిలిచాయి. సాయంత్రం బహుమతి ప్రధానోత్సవంలో అడిషనల్ ఎస్‌పి ఎన్‌బిఎం.మురళీకృష్ణ, ఎస్‌ఎఫ్ఐ మాజీ రాష్ట్ర నాయకులు, ఆచంట మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం డిఎస్‌పి మాట్లాడుతూ విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. అప్పుడే వారు చదువుల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించి, ఈ దేశానికి సేవ చేయగలరని ఆశించారు. మన దేశానికి యువతే బలమని, అలాంటి యువత చెడు వ్యసనాల బారిన పడకుండా జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించి, వారి కుటుంబానికి, వారి ప్రాంతానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చే విధంగా ఉండాలని అన్నారు. ఈ స్టూడెంట్ ఫెస్ట్ నిర్వహించిన ఎస్‌ఎఫ్ఐ నాయకులను వారు అభినందించారు. మాజీ ఎంఎల్‌ఎ డి.రాజగోపాల్ మాట్లాడుతూ యువత దేశ నాయకుల స్ఫూర్తితో తమ జీవితాన్ని నిర్మించుకోవాలని అన్నారు. 23 సంవత్సరాల వయసులోనే ఈ దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్ సింగ్‌ని, మన ప్రాంతంలో పుట్టి, గిరిజనులను కలుపుకొని ఉద్యమాన్ని నడిపి, బ్రిటీష్ వారిని గడగడలాడించిన అల్లూరి సీతారామరాజును ఆదర్శంగా తీసుకొని యువత అంతా విద్యార్థి, ప్రజా సమస్యలపై తమ గళం విప్పాలని తెలిపారు. చెడువ్యసనాల భారిన పడకుండా తమ అద్భుతమైన జీవితాన్ని నిర్మించుకోవాలని కోరారు. ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.ఈశ్వర్, టి.ప్రసాద్, ఫెస్ట్ కన్వీనర్ పి.వాసు, కో కన్వీనర్ ఎండి.జాన్, ఫెస్ట్ కమిటీ సభ్యులు కె.అనిల్, పి.ధనుంజయ పాల్గొన్నారు.

సన్యాసిరావు మృతి తీరని లోటు

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బలరాం, నేతలు

ఉండి : ఆర్ అండ్ బి వర్క్ ఛార్జ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తుది శ్వాస వరకూ కృషిచేసిన వర్క్‌ఛార్జ్ ఎంప్లాయిస్ రాష్ట్ర నాయకులు ఎస్‌హెచ్.సన్యాసిరావు మృతి ఉద్యోగులకు తీరని లోటని సిఐటియు పశ్చిమగోదావరి జిల్లా కమిటీ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసింది. ఆదివారం సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జెఎన్‌వి.గోపాలన్, కె.రాజా రామ్మోహన్ రాయ్, సిఐటియు బృందం సన్యాసిరావు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం, సిఐటియు జిల్లా అధ్యక్షుడు జెఎన్‌వి.గోపాలన్, కె.రాజారామ్మోహన్ రాయ్ మాట్లాడుతూ ఆర్అండ్‌బి శాఖలో అనేక సమస్యలతో బాధపడుతున్న ఉద్యోగుల సమస్యలపై రాష్ట్ర నాయకులు బాలాజీ దాసు సూచనలతో పెద్ద ఎత్తున పోరాటాలు చేసి పిఎఫ్, గ్రాడ్యూటీ, పెన్షన్ సౌకర్యాలు రిటైర్డ్ ఉద్యోగులు పొందేందుకు కృషి చేశారన్నారు. ఉద్యోగులకు ఏ చిన్న సమస్య వచ్చినా ఆ అధికారులతో సంప్రదింపులు జరిపి సమస్యలు పరిష్కారం చేసేవారని తెలిపారు. తమిళనాడులో అప్పటి జయలలిత ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులపై ఎస్మా ప్రయోగిస్తే దానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించడంలో సన్యాసిరావు చురుకైన పాత్ర వహించారన్నారు. సన్యాసిరావు సిఐటియు ఉద్యమంలో పాల్గొని నేటి తరానికి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. సిఐటియు నాయకులు బి.వాసుదేవరావు, ధనికొండ శ్రీనివాస్, లెనిన్ బాబు, బంగారు రావు, శరత్ బాబు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కణికల ఫ్యాక్టరీ యంత్రాల అడ్డగింత

ఆకివీడు : స్థానిక సమతా నగర్ ప్రాంతంలో ప్లాస్టిక్ కనికల తయారీ ఫ్యాక్టరీ మిషనరీ దింపేందుకు స్థానిక వ్యక్తి చేసిన ప్రయత్నంను గ్రామస్తులు అడ్డుకున్నారు. కాంటూరు ఐదుకు దిగువ ప్రాంతం కావడంతో అటవీ శాఖ అధికారులకు తెలిపారు. ఆ వెంటనే అక్కడికి వచ్చిన ఫారెస్ట్ సిబ్బంది మిషనరీని వెనక్కి పంపించారు. ఆదివారం ఈ సంఘటన చోటుచేసుకుంది. నిబంధనలకు విరుద్ధంగా కొల్లేరు ఐదవ కాంటూరులో ఫ్యాక్టరీ పెట్టేందుకు ప్రయత్నం గతంలో కూడా ఒకసారి జరిగింది. ఆనాడు జిల్లా కలెక్టర్, జిల్లా ఫారెస్ట్ అధికారి, కమిషనర్, తహశీల్దార్, పొల్యూషన్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేసి ఆపామని ఆ ప్రాంత నాయకుడు పోరాట యువకులలో ఒకరు బైరి ఆంజనేయులు తెలిపారు. అధికారులు ఆనాడు స్పందించి ఫ్యాక్టరీ పెట్టేందుకు అనుమతులు లేవని, పనులు నిలుపుదల చేయమని గతంలోనే చెప్పారు. లీజుకు తీసుకున్న ఆ కొత్త యువకులు మూతబడిన రైస్ మిల్లును గోడౌనుగా వాడుకుంటామని చెప్పి శనివారం రాత్రి మిషనరీ దింపే ప్రయత్నం చేశారన్నారు. అప్పటికప్పుడు గ్రామస్తులు అక్కడికి చేరుకొని మిషనరీని దింపకుండా అడ్డుకున్నారు. ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు వచ్చి అక్కడి నుంచి మిషనరీని బయటకు పంపించేశారు.

ప్రయివేటు యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రభుత్వ సెలవు దినాల్లో పాఠశాల నడుపుతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.ప్రసాద్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ సెలవులు, ఆదివారం రోజుల్లోనూ ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు తరగతులు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారన్నారు. పట్టణంలో ఉన్న ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై ఎన్నిసార్లు మండల విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లినా వారిపై ఎటువంటి చర్యలూ తీసుకోలేదని ఆయన ఆరోపించారు. ఎంఇఒ ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు అండగా నిలబడుతున్నారని విమర్శించారు. ఈ తరగతుల వల్ల విద్యార్థులు మానసికంగా, శారీరకంగా ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో రానున్న కాలంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సమీకరించి మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

ప్రకృతి వైద్యంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రకృతి వైద్యం ద్వారా అందరూ తమ శరీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని డాక్టర్ పి.కృష్ణ చైతన్య అన్నారు. ఆదివారం స్థానిక శ్రీరాయంపూడి సుబ్బిరెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ, ఆంధ్రా అసోసియేషన్(యుకె) జూనియర్ కాలేజీ ప్రాంగణంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దీర్ఘ కాలంగా అనేక ఆరోగ్య సమస్యలతో ఉన్నవారికి పరీక్షలు నిర్వహించి, సలహాలు, యోగా విధానం ద్వారా చికిత్స అందజేశారు. సుమారు 260 మంది పరిసర వాసులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. ఇడియల్ విజన్ సూపర్ స్పెషాలిటీ వైద్యులు డాక్టర్ కృష్ణ చైతన్య, డాక్టర్ సూర్య సౌమిత్, కళాశాల పాలక మండలి అధ్యక్షులు డాక్టర్ తేతలి గురు రెడ్డి, కార్యదర్శి టి.రామారెడ్డి, ప్రిన్సిపల్ ఎ.సత్య ప్రకాష్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపోతున్న రైతులను ఆదుకోవాలి

సిపిఎం మండల శాఖ డిమాండ్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎర్ర కాలువ ముంపు వల్ల నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని, జిల్లా పరిషత్ భూముల సాగుదారులకు పట్టాలు ఇవ్వాలని, జగన్నాథపురం నుంచి ఆరుగొలను గురుకుల కళాశాలకు వెళ్లే రోడ్డును నిర్మించాలని సిపిఎం జగన్నాథపురం గ్రామ శాఖ మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం జగన్నాథపురంలో సిపిఎం గ్రామశాఖ పీట కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా మండల కన్వీనర్ పాలు పూరి సత్యనారాయణ, మండల నాయకులు కండెల్లి సోమరాజు హాజరయ్యారు. మూడు సంవత్సరాల కార్యకలాపాలను, భవిష్యత్తు కర్తవ్యాలను చర్చించి సభ్యులు ఆమోదించారు. జగన్నాథపురం నవాబుపాలెం చుట్టుపక్కల ప్రాంతాల్లో పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు సైనికులుగా పనిచేయాలని, రానున్న రోజుల్లో పార్టీని బలోపేతం చేయడానికి కృషిచేయాలని వారు పిలుపునిచ్చారు. గ్రామ శాఖ నూతన కార్యదర్శిగా కండెల్లి విజయ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పీలగాది నాయుడు, ఆరేపల్లి సీతారామయ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి

మహదేవపట్నంలో ఫీవర్ సర్వే

ప్రజాశక్తి - ఉండి

వర్షాకాలంలో అంటురోగాలు భారిన పడకుండా ప్రతిఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది అన్నారు. ఆదివారం ఉండి మండలం మహదేవపట్నం గ్రామ శివారు ఉత్తరపాలెంలో వైద్య సిబ్బంది ఫీవర్ సర్వే నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరికైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించి, తగు వైద్యం చేయించుకోవాలని అన్నారు. అనంతరం గ్రామ సర్పంచి వనిమా సుబ్బలక్ష్మి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉత్తర పాలెంలో ఇటీవల వర్షాల వల్ల డ్రెయినేజీలు నిండి రోడ్లపైకి నీరు చేరడంతో కొంతమంది అస్వస్థతకు గురైనట్లు తన దృష్టికి రాగానే పంచాయతీ సిబ్బందితో డ్రెయినేజీలు పూడిక తీయించడం జరిగిందని తెలిపారు. గ్రామంలో ప్రజలు ఎవరైనా వైరల్ జ్వరాల బారిన పడితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

2న మాంసం, చేపల అమ్మకాలు నిషేధం

మున్సిపల్ కమిషనర్ అంజయ్య

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణ పరిధిలో అక్టోబర్ రెండో తేదీ గాంధీ జయంతి సందర్భంగా మాంసం, చేపలు అమ్మడం నిషేధమని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. అక్టోబర్ 2వ తేదీన నిబంధనలు ఉల్లంఘించి మాంసం, చేపలు అమ్మినా, వధించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఎస్‌జిఎఫ్ క్రీడల్లో గూడెం విద్యార్థుల హవా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఇటీవల జరిగిన ఎస్‌జిఎఫ్ పోటీలలో తాడేపల్లిగూడెం ఆదిత్య స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపల్ కె.వాసవికా శివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. బ్యాడ్మింటన్‌లో ఏడుగురు, ఖోఖోలో ఆరుగురు, చదరంగంలో నలుగురు, అథ్లెటిక్స్‌లో నలుగురు, కబడ్డీలో ఇద్దరు, ఫుట్‌బాల్ ఒకరు చొప్పున మొత్తం 24 మంది జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థులను, పిఇటి పుష్పలతను స్కూల్ డైరెక్టర్ శ్రీనివాస రెడ్డి, జిల్లా డైరెక్టర్ రాఘవ రెడ్డి, చైర్మన్ శేషారెడ్డి అభినందించారు.

అన్నదానంలో అపశృతి

యువకుడు మృతి

ప్రజాశక్తి - ఆకివీడు

స్థానిక సాయి నగర్‌లో ఆదివారం రాత్రి వినాయక చవితి సందర్భంగా జరిగిన అన్న సమారాధనలో అపశృతి చోటుచేసుకుంది. విద్యుత్ షాక్‌కు గురై ఒక యువకుడు మరణించాడు. పోలీసుల కథనం ప్రకారం భోజనాల ఏర్పాట్లు చేస్తుండగా వై.హేమంత్ సూర్యసాయి(19) ఎలక్ట్రీషన్ పొరపాటున విద్యుత్ వైర్ తగిలి పడిపోయాడు. వైద్యానికి ప్రయత్నం చేసిన ఫలించలేదు. ఎస్ఐ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రశ్నార్థకంగా సార్వాసాగు..!

వానలు, వరదలతో నిండా మునిగిన రైతన్న
ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రస్తుత సార్వా రైతు పరిస్థితి గోరుచుట్టు మీద రోకలి పోటు అన్నట్లుగా తయారైంది. ఈమధ్య కాలంలో భారీ వానలు, వరదల ప్రభావంతో మండలంలో సార్వా పంట మొత్తం నీట మునిగిపోయింది. ఆ వరద నుంచి గట్టెక్కడం అనుకునే దశలో మరోసారి కుంభవృష్టి మొదలైంది. గత వారం రోజులుగా మండలంలో కురుస్తున్న భారీ వానలకు మొత్తం వరి తుడిచిపెట్టుకుపోయే పరిస్థితి నెలకొంది. మొదట నష్టానికి ప్రభుత్వం పంట నష్టం ఇచ్చినప్పటికీ అది నామమాత్రంగానే ఉంటుంది. దీంతో రైతన్న పరిస్థితి దయనీయంగా ఉంది. ఎకరానికి కనీసం రూ.20 వేల నుంచి 30 వేల వరకు ఇప్పటివరకు రైతుకు ఖర్చయ్యింది. ఇంత ఖర్చు పెట్టి ఎంతో శ్రమ వెచ్చించిన పంట మొత్తం కుళ్లిపోతుంటే రైతులు ఆవేదనకు గురవుతున్నారు. ఈ స్థితిలో ఇంజన్ వేసి రైతు నీళ్లను బయటకు తోడుతున్నాడు. ఇప్పటికే ఆకు మూడు వంతులు కుళ్లిపోయింది. మిగిలిన



నీట మునిగిన వరిచేలు

తెలియక రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఈ వర్షాలతో ఉన్న నీరు బయటికి వెళ్లకపోగా.. ఇంకా నీరు వచ్చి చేరడంతో పంటకాలువలు, పిల్లకాలువలు సైతం పొంగిపొర్లుతున్నాయి. ఈ స్థితిలో వరి చేలలో నీరు బయటికి వెళ్లే అవకాశం ఎంత మాత్రం లేదు. ఇక ఈ సార్వా వరి పూర్తిగా కుళ్లిన పరిస్థితి నెలకొంది. ఈ దశలో ఇక ఈ సంవత్సరానికి సార్వా పంట లేనట్టేనా అనే పరిస్థితి ఏర్పడి, రైతు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఇదే జరిగితే సంవత్సరం మొత్తం గ్రాసం పోయినట్టే. సార్వా పంట ఈ ప్రాంతంలో ఆహారంగా వాడతారు. అందుకు వినియోగించాలి మిగిలినవి అమ్ముతారు. దాళ్వా పంటకి పెట్టుబడి పెడతారు. సార్వా పంట పోయిన పరిస్థితిలో సంవత్సరం మొత్తం గ్రాసం పోయినట్టే. ఇక దాళ్వా పెట్టుబడికి దిక్కులేని పరిస్థితిలో రైతులు విలపిస్తున్నారు. ఇటువంటి పరిస్థితిలో రైతులను ప్రభుత్వం ఆదుకొని ఆసన్నమైనా కాపాడుకుంటే ఎకరానికి ఐదు నుంచి పది బస్తాలైనా వస్తుందని రైతు ఆశతో తిరిగి పని మొదలుపెట్టాడు. ఈ దశలో మరోసారి భారీ వర్షాలు మొదలయ్యాయి. దీంతో వారు గోడు ఎవరికి చెప్పుకోవాలో నష్టపరిహారం అందించాలని రైతన్నలు ఎదురుచూస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రముఖ వైద్యులు ఆదినారాయణరెడ్డి, అలేఖ్య

ప్రజాశక్తి - పెనుమంట్ర

పరిసరాలను శుభ్రంగా ఉంచడం, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆదినారాయణ రెడ్డి, డాక్టర్ అలేఖ్య దంపతులు అన్నారు. ఆదివారం మండలంలోని మార్టేరు మానవతా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానవత మండల అధ్యక్షుడు కర్రి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఉత్తమ సమాజ నిర్మాణం, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మానవతా సంస్థ పనిచేస్తుందని అన్నారు. రాష్ట్రంలో ఏ జిల్లా వాసులకు లేని సౌకర్యం గోదావరి జిల్లాలకు ఉందని, నదీ తీరం, పంట కాలువలు రెండు ఈ జిల్లా వాసులకు ఉన్నాయన్నారు. అటువంటి గోదావరి నీటిని కలుషితం అవడం బాధాకరమని, పర్యావరణ పరిరక్షణలో నదీజలాలు, పంట కాలువలు కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో ఎటువంటి సహాయమైనా చేయడానికి కలిసి వస్తామని డాక్టర్ అలేఖ్య తెలిపారు. మానవతా సంస్థ ద్వారా ఫిజియో క్లీనిక్‌కు వచ్చిన పేద వారికి ఉచితంగా సేవలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పేద విద్యార్థిని చదువు నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయం మానవతా సంస్థ సభ్యుల సహాయంతో డాక్టర్ ఆదినారాయణ రెడ్డి, అలేఖ్య దంపతులు విద్యార్థినికి అందజేశారు. అంతకుముందు సంస్థ కార్యదర్శి సంస్థ చేసినటువంటి కార్యక్రమాల గురించి వివరించారు. కోశాధికారి చదువుల నరేంద్ర సంస్థ జమా ఖర్చుల వివరాలు తెలియజేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కొత్త సత్యనారాయణ మూర్తి, రీజనల్ చైర్మన్ బాణాల శ్రీనివాసరావు, మండల చైర్మన్ కడలి సుబ్రహ్మణ్యం ప్రసంగించారు. అనంతరం ముఖ్య అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోచైర్మన్ పడాల జగన్నాథరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ బండి ప్రసాద్, ఉప కార్యదర్శి దొంగ జయ దుర్గారావు, ఇసి ఎమర్జెన్సీ చిర్ల వంశీ హరినాధ రెడ్డి, కార్యవర్గసభ్యులు కాశీ విశ్వనాథం, ఇంద్రేశ్వర గుప్తా, అమృత వాక్కుల సత్యనారాయణ, సోడసాని రాము పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ఆదినారాయణ రెడ్డి దంపతులు

మానవత ఆధ్వర్యాన విద్యార్థులకు కెరీర్ గైడెన్స్

మానవతా స్వచ్ఛంద సంస్థ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కెరీర్ గైడెన్స్ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రాంతాల్లోని వివిధ విద్యాసంస్థలలో 10వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు సంస్థ కెరీర్ గైడెన్స్ కమిటీ ఛైర్‌పర్సన్ డాక్టర్ కోడూరి రాధా పుష్పవతి ఆదివారం తెలిపారు. ఆయా గ్రామాల్లో స్థానిక మానవతా కమిటీలు నిర్వహించే కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో మెరిట్ విద్యార్థులకు జిల్లా కమిటీ వారిచే స్పాన్సర్ చేయబడిన ప్రోత్సాహక బహుమతులను జిల్లా కన్వీనర్ ద్వారా వివిధ మండలాలకు అందజేయనున్నట్టు ఆమె పేర్కొన్నారు. ఈమేరకు ప్రతి మండలంలోని ఎంపిక చేసిన పాఠశాలలలో కెరీర్ గైడెన్స్ తరగతులను నిర్వహించాలని అన్నారు. ఆయా మండల నిధుల నుంచి 3 విద్యా సంస్థలలో కెరీర్ గైడెన్స్ తరగతులను నిర్వహించాలని, జిల్లా కన్వీనర్స్ ద్వారా జిల్లా కమిటీ వారిచే స్పాన్సర్ చేయబడిన ప్రోత్సాహక బహుమతులుగా మెమెంటోలు, స్పోకెన్ ఇంగ్లిష్ బుక్స్, ఫైల్స్, సర్టిఫికెట్స్, రామకృష్ణ మిషన్ వారి తేజో కిరణాలు అందజేస్తామని ఆమె వెల్లడించారు. విద్యార్థులలో స్ఫూర్తి, పోటీతత్వం నింపే ఈ కార్యక్రమాలను కమిటీ సభ్యులు నిర్వహించాలని ఆమె కోరారు.

గుండె జబ్బుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పలుచోట్ల గుండె పరీక్షలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

వరల్డ్ హార్ట్ డే సందర్భంగా పాలకొల్లు రోటరీ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఉచిత గుండె పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రోటరీ 3020 అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. విజయ డయాగ్నొస్టిక్ సెంటర్ వారి సౌజన్యంతో బ్లడ్ షుగర్, బిపి, ఇసిజి పరీక్షలు ఉచితంగా చేశారు. ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఆర్.రవికాంత్ కార్డియాలజిస్ట్ గుండె పరీక్షలను నిర్వహించారు. పాలకొల్లు పరిసర ప్రాంతాల నుంచి సుమారు 120 మంది వరకూ విచ్చేసి గుండె పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ రావాడ సతీష్, క్లబ్ సెక్రటరీ జవాజి కళ్యాణ్, ట్రెజరర్ పోతా బత్తుల సత్యనారాయణ, క్లబ్ సభ్యులు వి.గంగాధర్, కావలి నగేష్, గన్నాబత్తుల శ్రీనివాస్, ఎన్ఎన్.మూర్తి, కోటి రామచంద్రరావు, శిరిగినీడి రాము పాల్గొన్నారు.

నరసాపురం : గుండె జబ్బుల పట్ల అప్రమత్తంగా ఉండాలని నరసాపురం నియోజకవర్గ బిజెపి కన్వీనర్ మేకల సతీష్ అన్నారు. ఆదివారం వరల్డ్ హార్ట్ డే సందర్భంగా నరసాపురంలో పాత బజార్ సూర్య స్కూల్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గుండె జబ్బుల ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని మేకల సతీష్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ శిబిరంలో 300 మందికి ఉచిత గుండె వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గన్నాబత్తుల సత్యవతి, బొమ్మిడి సూర్య కుమారి, ఆత్మూరి రమా, సిహెచ్.మురళీధర్, కోట్ల రామ్ కుమార్, కనకం వరప్రసాద్ పాల్గొన్నారు.

తణుకు : సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించు ఇంటింటికీ వైద్యం కార్యక్రమంలో భాగంగా ప్రముఖ నేత్ర వైద్యులు డా.హుస్సేన్ అహ్మద్, కె.సావరం, తణుకు ప్రాంతాల్లో పర్యటించి 8 మంది వృద్ధులకు ఉచిత వైద్యసేవలు అందించారు. సంఘ సభ్యులు దాట్ల రామరాజు ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కోశాధికారి అర్జి భాస్కరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

యుటిఎఫ్ కృషి అభినందనీయం

ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ, సమస్యలను పరిష్కరిస్తూ, సామాజిక అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే విధంగా ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) కృషి చేయడం అభినందనీయమని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ కొనియాడారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా తణుకు ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాలలో ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి ఆటల పోటీలు, టీచర్ ఒలింపిక్స్‌ని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా యుటిఎఫ్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. గత పాలనలో ఉపాధ్యాయలను అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేశారని, ఆ పరిస్థితి నుంచి కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయ హక్కులను కాపాడే విధంగా, వారి సమస్యలను పరిష్కరించే విధంగా ముందుకు వెళుతుందన్నారు. గతంలో ఉపాధ్యాయులకు వేతనాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితిలో ఉండేవారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రతీ నెలా 1వ తేదీన వేతనాలు అందడంతో సంతోషంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కెఎస్‌డి కళాశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బోర్రా గోపిమూర్తి, జిల్లా అధ్యక్షులు విజయరామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి అంగర రామభద్రం, జిల్లా సహాధ్యక్షులు కె.రాజశేఖర్, జిల్లా కోశాధికారి పట్టాభిరామయ్య, జిల్లా కోఆర్డినేటర్, జిల్లా కార్యదర్శి టిజె.జయకుమార్ పాల్గొన్నారు.



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ ఆరిమిల్లి

సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమించాలి

సిపిఎం పట్టణ కార్యదర్శి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పార్టీ సభ్యులందరూ రాజకీయపరంగా ఎదగాలని, పార్టీని పట్టణంలో విస్తరించే విధంగా పనిచేసి స్థానిక సమస్యల మీద పెద్ద ఎత్తున ఉద్యమించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు సూచించారు. ఆదివారం తాడేపల్లిగూడెం సిపిఎం భాగ్యలక్ష్మీ పేట శాఖ 8వ మహసభ స్థానిక భాగ్యలక్ష్మీ పేట కాలపురెడ్డి కొండలరావు ఇంటివద్ద చిటికిన రాము అధ్యక్షతన నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు కలిగట్ల వీర్రాజు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ మహాసభకు సిపిఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, పట్టణ నాయకులు జవ్వాది శ్రీను హాజరయ్యారు. గత మూడు సంవత్సరాల కాలంలో పార్టీ నిర్వహించిన కార్యక్రమాలను కార్యదర్శి నివేదిక రూపంలో కరెడ్ల రామకృష్ణ ప్రవేశ పెట్టగా శాఖా సభ్యులు చర్చించి ఆమోదించారు. ఈ మహసభను ఉద్దేశించి సిపిఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి సంస్థాగత మహసభలు జరుగుతాయని అన్నారు. సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ పట్టణంలో రోడ్లు, డ్రెయినేజీ, మంచినీరు సరఫరా, ఆస్తిపన్ను, నీటిపన్ను మీద ఆందోళనలు చేయాలని, గత ప్రభుత్వం ఇచ్చిన ఇంటిస్థలాలలో ప్రస్తుత ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులుకు వెంటనే ఇవ్వాలని, భాగ్యలక్ష్మీ పేట శివారు ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయినేజీ సమస్యల మీద పెద్ద ఎత్తున ఉద్యమించాలని, టిడిపి కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని తీర్మానాలను ప్రవేశపెట్టారు. ఈ మహసభకు పట్టణ నాయకులు జవ్వాది శ్రీను, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, భాగ్యలక్ష్మీ పేట శాఖా సభ్యులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో 29 మంది విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - తణుకు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 విభాగంలో జిల్లా స్థాయిలో ఈనెల 13వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జరిగిన స్పోర్ట్స్ గేమ్స్ ఎంపికల్లో ఎస్‌కెఎస్‌డి మహిళా జూనియర్ కళాశాలకు చెందిన 29 మంది విద్యార్థినిలు ఎంపికైయ్యారని కళాశాల ప్రిన్సిపల్ భూపతిరాజు హిమబిందు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రికెట్‌లో ఎం.సిరి, బాల్ బ్యాడ్మింటన్‌లో పివి.కిరణ్మయి, ఎన్.ఈశ్వరీ లలితాకుమారి, ఎం.అమూల్య, కబడ్డీలో కె.వసంత, కీర్తి, బాస్కెట్‌బాల్‌లో యోహన గాయత్రి, బి.సురేఖ, ఎస్.భారతి, ఫుట్‌బాల్‌లో ఎల్.దేవమాధురి ఎంపికయ్యారు. హాకీలో పి.కీర్తి, పి.సువర్ణిక, షటిల్‌లో ఎస్.ఈశ్వరి, పి.రోషిత, నవ్య, అమృత వర్షిణి, మేఘన, యోగాలో టి.సంధ్యారాణి, ఎల్.దేవమాధురి, కుసుమకావ్య, పి.కీర్తిసువర్ణిక, సిహెచ్.శశివెన్నెల, వాలీబాల్‌లో జి.విజయలక్ష్మీ, ఎ.శిరీష, ఖోఖోలో డిఎస్.సిరిసుధ, సుష్మభారతి, సిహెచ్.శైలజ, కె.సుభాషిణి, త్రోబాల్‌లో కె.మేరీమణి, బ్లెస్సీ, చెస్‌లో జి.ప్రవల్లికలు ఎంపికైయ్యారని తెలిపారు. అథ్లెటిక్స్ విభాగంలో ఎంపికైన విద్యార్థులు 100 మీటర్ల పరుగు పందెంలో సుష్మభారతి, సాఫ్ట్‌బాల్‌లో ఎ.శిరీష, బేస్ బాల్‌లో ఎ.శిరీష, డి.నాగమౌనికలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన విద్యార్థినులను కళాశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు ఎం.శ్రీనివాసరావు, ఎం.రత్నకుమారి పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో ఉపాధ్యాయుల ప్రతిభ

ప్రజాశక్తి - మొగల్తూరు

జిల్లాస్థాయి క్రీడా పోటీలలో మొగల్తూరు మండలానికి చెందిన ఉపాధ్యాయులు ప్రతిభ కనబరిచారు. యుటిఎఫ్ స్వర్ణోత్సావాలలో భాగంగా ఆదివారం తణుకులో నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడాపోటీలలో మండలంలోని కెపిపాలెంలో ఉన్న జెడ్‌పి ఉన్నత పాఠశాలకు వై.రవి (పిజిటి) 200 మీ పరుగు పందెంలో ప్రథమ స్థానం, షటిల్ బ్యాడ్మింటన్ తృతీయ స్థానంలో నిలిచారు. ఇదే పాఠశాలకు చెందిన కె.శ్రీనివాస బాబు (పిజిటి) 200 మీటర్ల పరుగు పందెంలో 45 ప్లస్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు. జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో విజయం సాధించిన వారు రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు చింతపల్లి కృష్ణమోహన్, సిహెచ్.శ్రీనివాసులు తెలిపారు.



క్రీడాపోటీల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఉన్నత ప్రమాణాలతో విద్యా బోధన

ఆర్ఐ చంద్రశేఖర్

మొగల్తూరు : జూనియర్ కళాశాలలు ఎప్పటికప్పుడు ఉన్నత ప్రమాణాలతో విద్యను విద్యార్థులకు బోధించాలని ఆర్ఐ ఒ.చంద్రశేఖర్ సూచించారు. మండలంలోని పేరుపాలెంలో ఎపిజెఎంఎ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జూనియర్ కళాశాలల, జిల్లాస్థాయి జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గుణాత్మక విద్యను పెంపొందించే విధంగా విద్యార్థుల ఉన్నత భవిష్యత్తును తీర్చిదిద్దే విధంగా పనిచేయాలని, విద్యను బోధించే విషయంలో శ్రద్ధ, నాణ్యత అనే అంశాలను పరిగణలోకి తీసుకున్నప్పుడే విజయం వరిస్తుందని ఆయన సూచించారు. రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు ఘంటసాల బ్రహ్మాజీ, సెక్రెటరీ వివి.స్వామి, ట్రెజరర్ అవినాష్, జి.సత్యనారాయణ, సుధీర్ కుమార్ రాజు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు ఏలూరు జిల్లా దెందులూరు మండలం, పోతునూరు గ్రామకాపురస్తులు బెలిగిరి పరమేష్ గారి కుమారుడు **మహేష్ కుమార్** గారి సంజాయిషీపై మీకు తెలుపునది ఏమనగా

నా క్లయింటు యొక్క లింకు డాక్యుమెంటు నెం.**591/1972** లు భీమడోలు **ఎస్.ఆర్.ఓ** లో రిజిష్టర్డు కాబడిన క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్థి డాక్యుమెంట్ **ది.27.09.2024**న లోన్ నిమిత్తం ఏలూరు వెళ్ళుచుండగా కొవ్వలి, పోతునూరు మధ్య కవరు జారిపోవుట చేత పై డాక్యుమెంట్ కనబడ లేదు. కావున పై నెంబరు డాక్యుమెంటు దొరికిన ఎడల క్రింది అడ్రస్సుకు గాని నా క్లయింటు అడ్రస్సుకు గాని యివ్వవలసినదిగా కోరుచున్నారు.

షెడ్యూలు:ఏలూరుజిల్లా, భీమడోలు **ఎస్.ఆర్.ఓ** పోతునూరు గ్రామములో ఆర్.ఎస్.నెం.**267/5**లో **340** చ॥గ॥**స్థలమునకు హద్దులు :**

తూర్పు:గుళ్ళల్లి నాగమణి ఆస్థి, **దక్షిణం :** స్వరాజ్య భవన్ ఆస్థి , **పడమర :** దేవినేని వెంకయ్య చౌదరి ఆస్తి , **ఉత్తరం :** రోడ్

క్లయింటు అడ్రస్సు : బెలిగిరి మహేష్ కుమార్ S/o. పరమేష్, పోతునూరు గ్రామము, దెందులూరు మండలం సెల్ : **9390477999**

B.KUMAR
Advocate, ఏలూరు

ఎండాకు తెగులు నివారణకు సస్యరక్షణ చర్యలు

ప్రజాశక్తి - మొగల్తూరు

వరిలో ఇటీవల వ్యాపిస్తున్న ఆకు ఎండు తెగుల నివారణకు సస్యరక్షణ చర్యలు వ్యవసాయ శాఖ జిల్లా అధికారి జెడ్ వెంకటేశ్వరరావు రైతులకు సూచించారు. మండలంలోని పలు గ్రామాలలో ఆయన పర్యటించారు. రామన్నపాలెంలో ఆకు ఎండు తగిలి సోకిన చేనును సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. 30 వరకు ఇకెవైసి చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. మండల శాఖ వ్యవసాయ అధికారి ఎస్.అబ్దుల్ రహీం, ఆర్‌బికె ఇన్‌ఛార్జి డి.కావ్య, రైతులు పెనుమత్స సుబ్బరాజు, రాయపరాజు, విఆర్ఎలు ఉన్నారు.

మార్టేరు మాజీ సర్పంచి కోనాల మృతి

ప్రజాశక్తి - పెనుమంట్ర



మండలంలోని మార్టేరు గ్రామ పంచాయతీ మాజీ సర్పంచి కోనాల వీర రాఘవరెడ్డి(80) ఆదివారం సాయంత్రం మృతి చెందారు. ఆయన కొద్దికాలంగా స్వల్ప అనారోగ్యంతో ఇంటికే పరిమితమయ్యారు. కోనాల మృతికి పలు పార్టీలకు చెందిన పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

బండి ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కలకలలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి మోకా అరుణ్ కుమార్, చైర్మన్ కడలి మాణిక్యాలరావు, ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

In The Court Of The Principal District Judge :: Eluru
I.A.No.441/2024, A.S.No. /2024

Between:
Sirimella Gopi Alias Gopi Venkata Subba Rao
...Petitioner /Appellant
AND
Achanta Madhusudhana Rao
...Respondent /Respondent

TO: Respondent /Respondent:
Achanta Madhusudhana Rao, S/o. Late Satyanarayana, Hindu, Male, Aged 53 Years, Flat No.202, V.V.Satyanarayana Nilayam, 5th Road, Santhi Nagar, Eluru, Eluru Dist., EJCPC.

పై నెంబరు గల ఐ.ఎ.నెం. 441/2024లో రెస్పాండెంటు గారికి ఎన్నిసార్లు కోర్టు నోటీసులు పంపినా పుచ్చుకోకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు నోటీసులు అమలు నిమిత్తం పేపరు పబ్లికేషన్ ఆర్డరు వేసినారు. కావున పై వారికి ఏమయినా ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టు వారి ఎదుట **ది.24-10-2024వ తేదీ ఉదయం గం॥ 10:30 ని॥లకు హాజరు కావలెను.** లేనిచో మీ పరోక్షమున తీర్పు చెప్పనబడును.

Sri NEKKARGANTI NARASHIMA RAO
Eluru, 23-9-24. Advocates, Eluru. Cell: 98481 18984

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఏలూరు
I.A.No.567/2019 in O.S.No.524/2019

బిట్వీన్:
షేక్ సున్ని సాహెబ్ (డైడ్) మరియు వగైరాలు
...పిటీషనరు /పిటీషనర్లు /వాదులు
మరియు
అనగాని రాధాకృష్ణ
...రెస్పాండెంటు /రెస్పాండెంటు /ప్రతివాది

TO: రెస్పాండెంటు /ప్రతివాది:
అనగాని రాధాకృష్ణ, తండ్రి: వెంకటేశ్వరరావు, హిందు, పురుషుడు, వ్యాపారం, డో.నెం.3-66, రాముల వారి గుడి ప్రక్కన, గోగుంట రోడ్, వసంతవాడ గ్రామం, పెదపాడు మండలం, ఏలూరు జిల్లా.

పై నెంబరు గ్రంధములో తమరి కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం రెస్పాండెంటు /ప్రతివాదికి ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు పత్రికాముఖముగా ఆర్డరు వేసియున్నారు. ఇందలి రెస్పాండెంటు /ప్రతివాది **ది.13-10-2024వ తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని లేనియెడల ప్లీడరు గారి ద్వారా గాని హాజరై పై కోర్టు వారి ఎదుట తమరి సంజాయిషీ తెలుపుకోగలరు.** లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

కూరపాటి పృధ్విరాజ్,
అడ్వకేట్, ఏలూరు.
సెల్: 80198 26216

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఏలూరు
I.A.No.588/2022 in I.A.No.567/2019 in O.S.No.524/2019

బిట్వీన్:
షేక్ సున్ని సాహెబ్ (డైడ్) మరియు వగైరాలు
...పిటీషనరు /పిటీషనర్లు /వాదులు
మరియు
అనగాని రాధాకృష్ణ
...రెస్పాండెంటు /రెస్పాండెంటు /ప్రతివాది

TO: రెస్పాండెంటు /ప్రతివాది:
అనగాని రాధాకృష్ణ, తండ్రి: వెంకటేశ్వరరావు, హిందు, పురుషుడు, వ్యాపారం, డో.నెం.3-66, రాముల వారి గుడి ప్రక్కన, గోగుంట రోడ్, వసంతవాడ గ్రామం, పెదపాడు మండలం, ఏలూరు జిల్లా.

పై నెంబరు గ్రంధములో తమరి కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం రెస్పాండెంటు /ప్రతివాదికి ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు పత్రికాముఖముగా ఆర్డరు వేసియున్నారు. ఇందలి రెస్పాండెంటు /ప్రతివాది **ది.13-10-2024వ తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని లేనియెడల ప్లీడరు గారి ద్వారా గాని హాజరై పై కోర్టు వారి ఎదుట తమరి సంజాయిషీ తెలుపుకోగలరు.** లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

కూరపాటి పృధ్విరాజ్,
అడ్వకేట్, ఏలూరు.
సెల్: 80198 26216